ప్రజాశక్తి

ఆదివారం 10 నవంబర్ 2024 5 విజయనగరం



ఎల్ఐసి ఏజెంట్ల సమస్యలపై ఎమ్‌పికి వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎల్ఐసి ఏజెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎల్ఐసి ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా విజయనగరం బ్రాంచ్ నాయకులు శనివారం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను యూనియన్ విజయనగరం బ్రాంచ్ అధ్యక్షుడు చిల్లా రామకష్ణ, కార్యదర్శి ఇల్లాపు కృష్ణ తీసుకువెళ్లారు. తగ్గించిన కమిషన్ ను గతంలో ఇచ్చిన మాదిరిగానే ఇవ్వాలని, క్లా బ్లాక్ విధానాన్ని రద్దు చేయాలని, ఈ విషయాన్ని ఎల్ఐసి యాజమాన్యం దష్టికి తీసుకువెళ్లాలని కోరారు. ఎంపి స్పందిస్తూ ఆయా సమస్యల పరిష్కారానికి కషి చేస్తామని చెప్పారు.కార్యక్రమంలో జోనల్ కమిటీ సభ్యుడు బడ్డుకొండ వెంకట రమణ, విజయనగరం బ్రాంచ్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు సబ్బవరపు సూరినాయుడు, డివిజన్ ఉపాధ్యక్షుడు జరజాపు వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న విజయనగరం ఉమ్మడి జిల్లా క్రీడాకారులు



క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్, డిఇఒ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రతినిధులు

క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి : కలెక్టర్

ఘనంగా రాష్ట్ర స్థాయి అండర్ -14 వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-భోగాపురం

క్రీడా పోటీల్లో విద్యార్థులు గొప్ప క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోరారు. క్రీడల్లో రాణించాలంటే శారీరక ఆరోగ్యంతో పాటు, ఎంతో శ్రమ, పట్టుదల, ఓర్పు ఉండాలని సూచించారు. స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ రాష్ట్రస్థాయి అండర్ -14 వాలీబాల్ పోటీలు శనివారం భోగాపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు నిర్వహించే ఈ పోటీలకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి 26 బాల బాలికల జట్లు హాజరయ్యాయి. కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఈపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల్లో రాణించి, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. తద్వారా తమ జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి గొప్ప పేరు ప్రఖ్యాతులు సముపార్జించాలని కోరారు. రాష్ట్రస్థాయి పోటీలకు మన జిల్లా ఆతిథ్యం ఇవ్వడం ఆనందదాయకంగా ఉందని, ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖను అభినందించారు. జిల్లా విద్యాశాఖ అధికారి మాణిక్యం నాయుడు మాట్లాడుతూ విద్యార్థులకు చదువులతోపాటు క్రీడలు కూడా ఒక భాగమని పేర్కొన్నారు. అందుకే ప్రభుత్వం విద్యా బోధన తో పాటు క్రీడా పోటీల నిర్వహణ కూడా ప్రాధాన్యత ఇస్తోందన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఐపిఇ జి.భానుమూర్తి రాజు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పాఠశాల క్రీడా పోటీల నిర్వహణకు ఈ ఏడాది ప్రభుత్వం సుమారు రూ.7.4 కోట్లను మంజూరు చేసిందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఉత్తమ నైపుణ్యం ఉన్న క్రీడాకాలుగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కష్ణంరాజు మాట్లాడుతూ ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన 12 మంది బాలురను, మరో 12 మంది బాలికలను డిసెంబర్లో వారణాసిలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తారని తెలిపారు. ముందుగా జిల్లా కలెక్టర్ అంబేద్కర్ జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఫ్లాగ్ మార్చ్ తిలకించి క్రీడాకారుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. క్రీడాజ్యోతిని వెలిగించారు. పోటీలకు హాజరైన బాల బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా భోగాపురం కెజిబివి విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కతిక కార్యక్రమం ఆకట్టుకుంది.

కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ కె.వెంకటరమణ, ఎంఇఒ బి. చంద్రమౌళి, పాఠశాల హెచ్ఎం పిఎజిహెచ్ శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి గాయత్రి, రాష్ట్ర వాలీబాల్ సంఘ కార్యదర్శి భగవాన్‌దాస్, రాష్ట్రస్థాయి క్రీడా పోటీల పరిశీలకులు చంద్ర వర్మ, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు కెవిఎల్ఎన్ రాజు, దెందేరు పాఠశాల హెచ్ఎం సునీత, కె.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వివిధ జిల్లాల మధ్య పోటీలు జరిగాయి. విజయనగరం, నెల్లూరు బాలుర జట్ల మధ్య జరిగిన పోటీలో విజయనగరం జట్టు విజయం సాధించింది.



వాలీబాట్ పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్



పోటీలో తలపడుతున్న విజయనగరం, నెల్లూరు జిల్లా జట్లు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై ప్రజాపోరు

- సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ
- 14న కలెక్టరేట్, మండల కేంద్రాల్లో నిరసనలు

ప్రజాశక్తి-బొబ్బిలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 7నుంచి 14వరకు ప్రజాపోరు నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ తెలిపారు. స్థానిక లోకబంధు రెసిడెన్సీలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు అనుకూలంగా పాలన చేయకుండా కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా పాలన చేస్తోందని అన్నారు. రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి కూడా బిజెపి బాటలో పాలన సాగిస్తోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 7 నుంచి 14 వరకు ప్రజాపోరు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈనెల 14న జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద, జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేకూడతామని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన విధానాలు మారలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా పాలన చేస్తుందన్నారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మహిళలు, చిన్నపిల్లలకు భద్రత కల్పిండంలో పాలకులు విఫలమవ్వడంతో మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులు పెరిగిపోయాయని విమర్శించారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అడ్డుకోవడంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చొరవ తీసుకోవడం లేదన్నారు. దేశంలో మహిళలకు స్వేచ్ఛా, స్వాతంత్ర్యం లేదన్నారు. రాష్ట్రాల హక్కులను కేంద్ర ప్రభుత్వం హరిస్తుందని విమర్శించారు. జమిలి ఎన్నికలకు సిపిఎం వ్యతిరేకమన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బాదుడే బాదుడు అన్న టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని రకాల ధరలు, ఛార్జీలు పెంచి ప్రజలపై భారం వేస్తోందన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంలో విఫలమయ్యారన్నారు. ప్రశ్నిస్తామని చెప్పిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఎక్కడ ప్రశ్నిస్తున్నారని ప్రశ్నించారు. బిజెపి ఎజెండాను పవన్ కళ్యాణ్ ముందుకు తీసుకు వెళ్తున్నారని విమర్శించారు. స్కీమ్‌వర్కర్లపై రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడడం అన్యాయమని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈనేపథ్యంలో ప్రజలను ఐక్యం చేసి ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొడతామని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజాపోరును జయప్రదం చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, వి.లక్ష్మి ఉన్నారు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - కొత్తవలస

గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు సూచించారు. శనివారం ఉత్తరాపల్లి పంచాయతీ గాంధీనగర్‌లో పారిశుధ్యం, తాగునీటి వనరులపై పరిశీలన చేశారు. వాటర్ ట్యాంక్‌ను, వీధి కాలువలను పరిశీలన చేశారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలని తద్వారా రోగాల ప్రభలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కళ్యాణ చక్రవర్తి

ఉచిత న్యాయ సేవలే లక్ష్యం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కళ్యాణ చక్రవర్తి

ప్రజాశక్తి-విజయనగరంలీగల్

పేద ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు న్యాయ సేవాధికార సంస్థ తోడ్పడుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ చక్రవర్తి పేర్కొన్నారు. అట్టడుగు వర్గాల ప్రజలకు ఉచితంగా న్యాయ సేవలను అందించడమే ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. జిల్లా పాత కోర్టు భవన సముదాయంలో, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా న్యాయమూర్తి ముఖ్య అతిథి హాజరై ప్రసంగించారు. ఆర్థికంగా వెనుకబడినవారికి న్యాయసేవలను అందిచే ఉద్దేశంతో న్యాయ సేవాధికార సంస్థ వ్యవస్థను 1995 నవంబర్ 9న సుప్రీం కోర్టు ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ వ్యవస్థ ద్వారా జిల్లా స్థాయి, మండల స్థాయి లో సమావేశాలు నిర్వహించి ప్రజలకు, విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రెవిన్యూ, పోలీస్ శాఖల సహకారంతో విస్తతంగా న్యాయ అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నామని, తద్వారా పేదలు ఉచితంగా న్యాయ సేవలను పొందేందుకు వస్తున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని అన్ని వర్గాల వారు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి బి.అప్పల స్వామి, స్పెషల్ మొబైల్ కోర్ట్ జడ్జి పి.బుజ్జి, జిల్లా రెవిన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, ఎస్సీ, ఎస్టీ సెల్ డిఎస్‌పి ఎం.వీరకుమార్, న్యాయవాదులు జి.సత్యం తదితరులు పాల్గొన్నారు.



పదవులు దక్కించుకున్న టిడిపి నాయకులు సుజయ్‌కృష్ణ రంగారావు, తెంటు లక్ష్మునాయుడు, కావలి గ్రీష్మ, జనసేన నాయకులు పాలవలస యశస్వి

నలుగురికి నామినేటెడ్ పదవులు

- సుజయ్‌కృష్ణకు ఫారెస్ట్ డెవలప్‌మెంట్
- తెంటుకు బుడా
- గ్రీష్మకు కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్
- యశస్వికి కాపు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవులు

ప్రజాశక్తి- బొబ్బిలి/విజయనగరంటౌన్/రేగిడి

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కార్పొరేషన్ చైర్మన్ పదవులు జిల్లాలో నలుగురికి దక్కాయి. బొబ్బిలి నియోజకవర్గం నుంచి మాజీమంత్రి సుజయ కృష్ణరంగారావు, తెంటు లక్ష్మునాయుడుకు లభించాయి. రాష్ట్ర ఫారెస్ట్ డవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా సుజయ్‌కృష్ణ రంగారావును, బుడా చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడును నియమించింది. వారి నియామకం పట్ల టిడిపి నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎపి ఉమెన్స్ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా గ్రీష్మ

రాజాం నియోజకవర్గానికి చెందిన టిడిపి నాయకులు కావలి గ్రీష్మను ఎపి ఉమెన్స్ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్ పర్సన్‌గా కూటమి ప్రభుత్వం నియమించింది. ఈమె మాజీ స్పీకర్ కావలి ప్రతిభా భారతి కుమార్తె. తన తల్లి అడుగుజాడల్లో రాజకీయాలలో తనదైన శైలలో వ్యవహరించి టిడిపిని బలోపేతం చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే టికెట్‌ను ఆశించి బంగపడ్డారు. గ్రీష్మ సేవలను గుర్తించి చైర్‌పర్సన్ పదవి ఇవ్వడం పట్ల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అభినందించారు. కార్పొరేషన్ సేవలను మరింత ప్రజలకు అందించి, అందరు సహకారంతో ముందుకు నడిపిస్తానని ప్రజాశక్తితో ఆమె అన్నారు.

తూర్పు కాపు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా యశస్వి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తూర్పు కాపు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, జనసేన నాయకురాలు పాలవలస యశస్విని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టులో అడ్వకేట్‌గా ఉన్న యశస్వి 2019 ఎన్నికల్లో విజయనగరం శాసనసభ నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. అనంతరం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూ వస్తున్నారు. 2019 నుండి 2024 ఎన్నికల వరకు జనసేన పార్టీ కార్యక్రమాలను జిల్లాలో క్షేత్రస్థాయిలో నిర్వహించేందుకు ఆమె కృషి చేశారు. ఈనేపథ్యంలోనే ఆమెకు తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ పదవిని కేటాయించారు. ఈసందర్భంగా ఆమెకు జనసేన కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

నాగార్జున, గొంపకు దక్కని పదవులు

విచారంలో మరి కొందరు తమ్ముళ్లు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

తాజాగా టిడిపి కూటమి ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో గత ఎన్నికల్లో పార్టీకోసం అత్యంత కీలకంగా పనిచేసిన టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున, ఎస్.కోట నియోజకవర్గానికి చెందిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్టకు చోటు దక్కలేదు. వీరితోపాటు విజయనగరంలో ఐవిపి రాజు, డెంకాడకు చెందిన చెందిన కంది చంద్రశేఖర్, గజపతినగరానికి చెందిన కరణం శివరామ కృష్ణ, పార్వతీపురంలో ద్వారపురెడ్డి జగదీష్ కూడా కంగుతిన్నారు. గతంలో నెల్లిమర్ల నియోజకవర్గ సమన్వయకర్త కర్రోతు బంగార్రాజుకు మాత్రమే మార్కెఫెడ్ చైర్మన్‌గా నామినేటెడ్ పదవి దక్కిన సంగతి తెలిసిందే. తాజాగా శనివారం ప్రకటించిన జాబితాలో విజయనగరం జిల్లాలో ముగ్గురు టిడిపి నాయకులకు, ఒక జనసేన నాయకురాలికి అవకాశం దక్కింది. మాజీ మంత్రి ఆర్‌విఎస్‌కె రంగారావుకు ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గాను, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడుకు బుడా చైర్మన్‌గాను, జనసేన నాయకులు పాలవలస యశశ్వినికి తూర్పు కాపు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్‌గా పాలవలస యశశ్విని, రాజాంకు చెందిన కావలి గ్రీష్మలకు ఎపి ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా పదవులు దక్కాయి. ఈ నేపథ్యంలో మిగిలిన నాయకులు నిరాశ చెందుతున్నారు. ముఖ్యంగా నాగార్జున, గొంప క్రిష్ణలకు పదవులు రాకపోవడంపై వారి అనుచరులు జీర్ణించుకోలేకపోతున్నారు. మూడవ దఫాలో వీరిద్దరికీ కాస్త సముచిత స్థానమే లభిస్తుందన్న చర్చకూడా కొందరి నాయకుల నోట వినిపిస్తోంది. కరణం శివరామకృష్ణ గజతిపతినగరం నియోజకవర్గ కోటాలో నామినేటెడ్ పదవి కోసం చాలా కాలంగా ఆశపడుతున్నప్పటికీ రెండు దఫాలు అవకాశం దక్కలేదు. ఐవిపి రాజుకు ఇప్పటి వరకు పార్టీ పదవులు తప్ప ప్రభుత్వ పదవులేవీ దక్కలేదు. దీంతో, ఆయన అభిమానుల్లోనూ నిరాశ ఉంది. పార్వతీపురం నుంచి జగదీష్‌తోపాటు చిరంజీవులు కూడా పదవి ఆశించారు. కానీ వీరికి నిరాశ ఎదురైంది. బొబ్బిలిలో ఎన్నికల సభలో లోకేష్ ఇచ్చిన హామీ ప్రకారం లక్ష్మునాయుడుకు బుడా చైర్మన్‌గా పదవి దక్కింది.

పోలీసు దౌర్జన్యాలపై న్యాయపోరాటం

వైసిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పోలీసు యంత్రాంగం చంద్రబాబు, లోకేష్ గుప్పిట్లోకి వెళ్లి మానవ హక్కులను హరిస్తోందని, పోలీసు దౌర్జన్యాలపై వైసిపి న్యాయపోరాటం చేస్తుందని ఉమ్మడి విజయనగరం జిల్లా వైసిపి అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. శనివారం జిల్లా పరిధిలో పార్టీ నేతలలు, సోషల్ మీడియా కార్యకర్తలతో కలిసి స్థానిక డిఎస్‌పి శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశాఉ. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి కూటమి అసమర్థ పాలనను సోషల్ మీడియా ద్వారా ప్రశ్నిస్తే కేసులు పెట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు. సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టారని కార్యకర్తలను ఉగ్రవాదులను హింసించినట్టు హింసించారని, ఒక మహిళను ఐదు రోజులు చిత్ర హింసలు పెట్టారని అన్నారు. పోలీస్ అధికారులు చట్టబద్ధంగా వ్యవహరించాలని కోరారు. ఆయన వెంట విజయనగరం మేయర్ విజయలక్ష్మి, నెక్కల నాయుడు బాబు, కెవి సూర్యనారాయణరాజు, జెడ్‌పిటిసి సభ్యులు కెల్ల శ్రీనివాసరావు, గారతవుడు, జై హింద్ కుమార్ తదితరులు ఉన్నారు.



డిఎస్‌పికి వినతిని అందజేస్తున్న వైసిపి నాయకులు

ఉమ్మితడి విచారణలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విచారణ అంటే పారదర్శకంగా జరిగిందా? లేదా? అన్నది సరిచూడడం మాత్రమే కాదు, విచారణ ఒక నిర్థిష్టమైన కాలపరిమితిలోనూ పూర్తిచేయాలి. అప్పుడే తప్పులు, పొరపాట్లు వంటివాటి మధ్య తేడా కూడా తెలుస్తుంది. అధికార దుర్వినియోగం వంటి వాటికి ఆనవాళ్లు దొరుకుతాయి. తప్పుచేసిన వారిపై చర్యలు తీసుకునేందుకు, అలాంటి తప్పులు లేదా పొరపాట్లు, అధికార దుర్వినియోగం వంటివాటిని సరి చేసుకునేందుకు, పునరావృతం కాకుండా చర్యలు తీసుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది. కానీ, నేటి ప్రభుత్వాలు ఆదేశిస్తున్న విచారణలు విచారకరంగా మారాయి. విజయ నగరం పూర్వ ఆర్‌డిఒ భవానీ శంకర్‌పై విచారణకు, జిల్లాలోని నలుగురు తహశీల్దార్లపై చర్యలకు ప్రభుత్వం కొద్దిరోజుల క్రితం ఉత్తర్వులు జారీచేసిన సంగతి తెలిసిందే. ఎయిర్‌పోర్టు భూముల కొనుగోలు విషయంలో ఆర్‌డిఒ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారన్న అనుమానాలు ప్రభుత్వానికి ఉన్నాయట. తహశీల్దార్లు ప్రభుత్వ భూములను పరిరక్షించలేదట. ఈ మాటకొస్తే భవనీ శంకర్ ఆర్‌డిఒగా పనిచేసిన కాలంలోవున్న జాయింట్ కలెక్టర్ కిశోర్ కుమార్‌ను సరెండర్ చేశారు. ఆయనను ఎందుకు సరెండర్ చేశారో ఇప్పటికీ స్పష్టమైన ప్రకటన లేదు. కానీ, 22ఎలో ఏవో కిరికిరిలు జరిగాయన్నది బహిరంగంగానే చర్చనడిచింది. మరి కిశోర్‌పై ఉన్న అభియోగాలకు, నేడు ఆర్‌డిఒపై ఆదేశించిన విచారణకు సంబంధాలు ఉన్నాయా? లేవా? అన్న సందేహాలు సర్వత్రా వ్యక్తమౌతున్నాయి. ఆ మాటకొస్తే కిశోర్‌పై వేటు పడిన తరువాత కూడా అప్పటి కలెక్టర్ ఆధ్వర్యాన చాలా ప్రభుత్వ భూములపై 22ఎ ఎత్తివేత జరిగింది. మరి అవన్నీ పారదర్శకంగానే జరిగాయా? వాటిపై కూడా విచారణ జరపుతారా? అంటూ తాజాగా విచారణ ఆదేశాలు తెలిసినవారంతా చర్చించు కుంటున్నారు. ఈ సంగతి అటుంచితే,



గత ప్రభుత్వంలో 20ఏళ్ల క్రితం పొందిన అసైన్డ్ ల్యాండ్‌ను సంబంధిత సాగుదారుల పేరిట పట్టాలు మంజూరు చేస్తామని గత ప్రభుత్వం 9/2023 ఆర్డినెన్స్ తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. దీన్ని అడ్డం పెట్టుకుని అధికార యంత్రాంగంలో అత్యంత కీలకంగా వ్యవహరిస్తున్న ఓ ఉన్నతాధికారి, ప్రభుత్వ పెద్దలు కలిసి అసైన్డ్ భూములను వశపర్చుకున్నారు. మరో మాటలో చెప్పాలంటే... పెద్దలకిస్తేనే ఆ అసైన్డ్ భూములను ఫ్రీహోల్డ్ చేశారు. ఈ విధంగా విశాఖ జిల్లాలోని భీమిలి, మన జిల్లాలోని భోగాపురం, పూసపాటిరేగ తీరంలో అసైన్డ్ ల్యాండ్ వేలాది ఎకరాలు చేతులు మారింది. పూసపాటిరేగ మండలం కందివలస, చోడమ్మ అగ్రహారం, కనిమెట్ట రెవెన్యూ గ్రామాల పరిధిలో సుమారు 200 ఎకరాల అసైన్డ్ భూములను నాటి ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్సును అడ్డం పెట్టుకుని వశపర్చున్నారు. ఇందుకోసం ప్రైవేటు వ్యక్తులు రంగంలోకి దిగి దళితులు, పేదలను భయపెట్టి, బెదరించి విక్రయ ఒప్పంద పత్రాలు రాయించు కునట్టు కూడా బహిరంగ చర్చ నడించింది. రూ.కోట్ల విలువైన భూములను రైతుల నుంచి కారు చౌకగా తీసుకొని రూ.లక్ష, రెండు లక్షల చొప్పున మాత్రమే చెల్లించారు. దాదాపు తీర ప్రాంత అసైన్డ్ భూముల్లో ఎక్కువ శాతం ఇలాగే చేతులు మారాయి. ఈ విషయంలో ఎపిఐఐసి కోసం నాటి టిడిపి ప్రభుత్వం గుర్తించిన భూములను కూడా విడిచిపెట్టలేదు. ఇటువంటి అసైన్డ్, ప్రభుత్వ భూములను వశపర్చుకోవాడానికి ముందే ఏకంగా ఎంపీ నిధులతో సిమెంట్‌రోడ్లు కూడా వేసేసుకున్నారు. భోగాపురంలో అయితే, ఓ బినామి వ్యక్తి ద్వారా అప్పటి ప్రభుత్వ పెద్దలు, ప్రభుత్వంలోని ఓ ఉన్నతాధికారి కలిసి 99ఏళ్ల లీజు ప్రాతిపదికన ప్రభుత్వ భూములను వశపర్చుకున్నారు. ఈ విషయంలో అక్కడి సాగుదారులు అడ్డుతగిలే పరిస్థితి లేకుండా అప్పట్లో ప్రత్యేకంగా రాయలసీమ ప్రాంతం నుంచి ఓ సిఐని కూడా రప్పించారని ఈ ప్రాంత ప్రజానీకం చర్చించుకున్నారు. ఇందుకు సహకరించని ఓ విఆర్‌ఒపై బదిలీవేటు కూడా పడింది. ఇవి మచ్చుకు మాత్రమే. ఇటువంటి అక్రమాలెన్నో.. వీటన్నింటినీ పక్కనబెట్టి కేవలం అధికారులపైనే గురిపెట్టడం చూస్తుంటే మిగిలినవారిని అదుపులో పెట్టుకోవడం కోసమేనన్నది పబ్లిక్ టాక్.

రక్తికట్టించిన నాటిక పోటీలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రతి ష్టాత్మక తెలుగు రాష్ట్రాల 8వ ఆహ్వాన నాటిక పోటీలు గురజాడ కళాభారతిలో శనివారం ఘనం గా ప్రారంభ మయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన కళాంజలి ఆధ్వర్యాన రైతేరాజు సాంఘిక నాటిక అందరినీ కట్టిపడేసింది. విజయనగరం నాటకశాల ఆధ్వర్యాన ప్రదర్శించిన బంధనం నాటిక ఆహూతులను ఆకట్టుకుంది. రైతే రాజు నాటికలో రాజకీయ నాయకులు రైతులను ఏ విధంగా దోచుకు తింటున్నారో చూపించి, రైతులు తిరగబడితే రాజకీయ నాయకులు పరిపాలకులు ఎక్కడ ఉంటారు..చివరకు రైతు దేవోభవ అంటూ రైతును సన్మానించిన అంశాన్ని కళ్ళకు కట్టినట్టు చూపించారు. బంధనం నాటిక నేటి రోజుల్లో కుటుంబానికి విలువకుండా వంటల జీవితాలకు ఇష్టపడుతున్న ఈ సమాజాన్ని ఉమ్మడి కుటుంబాల వైపు ఎందుకు వెళ్లాలో, ఎందుకు జీవించాలో చూపించారు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపిరాజు, లోక్‌సత్తా అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ ఈపోటీలను ప్రారంభించారు. వైసిపి నాయకులు జమ్ము శ్రీను, జర్నలిస్ట్ బూరాడ శ్రీనివాసరావు , అభినయ శ్రీనివాసరావు, గెద్ద వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రైతేరాజు నాటికలో ఓ సన్నివేశం

అన్నింటికన్నా అన్నదానం మిన్న : మంత్రి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అన్ని దానాలలో అన్నదానం మిన్న' అని రాష్ట్ర చిన్న,సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద అయ్యప్ప మాలాదారుల కోసం నిర్వహిస్తున్న అన్న ప్రసాద క్రతువుకు హాజరయ్యారు. ముందుగా పంచముఖ ఆంజనేయ స్వామి వారిని దర్శించుకున్నారు.అనంతరం మాలాదారులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. కార్యక్రమంలో నిర్వాహకులు కంది మురళి నాయుడు, పెంటపాటి కామరాజు, ప్రముఖ వ్యాపారులు శివ్వా నాని, పెంటపాటి ముత్యాలు, నారాయణం లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలి

కొత్తవలస: గ్రామాల్లో పారిశుధ్యంపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వియ్యంపేట డాక్టర్ గోపాలకృష్ణ తెలిపారు. శనివారం వియ్యంపేట పిహెచ్‌సిలో సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆశ వర్కర్లకు పారిశుధ్యం, తాగునీటి వనరుల క్లీనింగ్, క్లోరినేషన్, డ్రైన్లలో తాగునీటి పైప్ లైన్స్ గుర్తించడం, ఇంటింటి ఫీవర్ సర్వే చేసి జ్వరాలు, డైయేరియాపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. బహిరంగ మలవిసర్జన, ఇంటింటి మరుగు దొడ్ల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఆహారపు అలవాట్లు, జీవన శైలి, పొగాకు వాడకం, మద్యం, జంక్ ఫుడ్స్ వినియోగాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అందరికి క్యాన్సర్ స్క్రీనింగ్‌పై అవగాహనా కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో సూపర్‌వైజర్, హెల్త్ అసిస్టెంట్, ఎఎన్‌ఎమ్, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

వేపాడ: మండల కేంద్రంలో గల ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో శనివారం ప్రధానమంత్రి సురక్ష వైద్య సేవా కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పిహెచ్‌సి వైద్యాధికారిని ఎ.ధరణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ ఎస్ ఫణిశ్రీ 39 మంది గర్భిణులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య సేవలకు వచ్చిన గర్భిణులకు బానాది గ్రామానికి చెందిన సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో భోజన సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు

బొబ్బిలి: ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఎస్ఐ జ్ఞానప్రసాద్ అన్నారు. పట్టణంలోని శనివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి లైసెన్స్ ఉండాలన్నారు. వాహనాలకు అనుమతి పత్రాలు, బీమా లేకపోతే ఆయా వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలు నివారణకు సహకరించాలని కోరారు. ఆయనతో ట్రాఫిక్ పోలీసులు ఉన్నారు.

గ్రామీణ వైద్యుల సమస్యలు పరిష్కరించాలి

శృంగవరపుకోట: గ్రామీణ వైద్యుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారికి ఆదివారం లక్కవరపుకోట మండలంలోని ఆమె నివాసంలో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం సభ్యులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ప్రథమ చికిత్స అందిస్తూ ప్రభుత్వ నిబంధనలను అనుసరిస్తూ గత 50 ఏళ్లుగా ప్రజలలో పనిచేస్తూ జీవనోపాధిని పొందుతున్నామని 2008లో అప్పటి ప్రభుత్వం జీవో నంబర్ 429ని ఇచ్చి తద్వారా గుర్తింపునిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రిలలో శిక్షణ ఇవ్వడం జరిగిందని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రాలలో సుమారు 95వేల మందికి శిక్షణ ఇచ్చారని, తదుపరి వచ్చిన ముఖ్యమంత్రులు ఆ జీవోను అమలుపరచడంలో విఫలమయ్యారని కనుక ప్రభుత్వంలోనైనా గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపే విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి తెలియజేయాలని ఆమెను కోరారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

బాడంగి: పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని ఉప విద్యాశాఖాధికారి మోహన్‌రావు అన్నారు. స్థానిక జెడ్‌పి పాఠశాలను ఆయన శనివారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించి రాబోయే పదోతరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించాలని, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందివ్వాలని, అపార్ కార్డుల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎంఇఒ 2 ఎం.రాజేశ్వరి, ఇంచార్జ్ హెచ్.ఎం వెంకటలక్ష్మి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సిపి బ్రౌన్ జయంతి

రామభద్రపురం: తెలుగు భాషోద్ధారకుడు, తెలుగు సాహిత్యానికి ఎనలేని కృషి చేసిన తొలి ఆంగ్లేయుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ జయంతిని నాయుడువలస పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిరి రాజు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజు మాట్లాడుతూ ఆంగ్లేయుడై యుండి తెలుగు భాషమీద మక్కువతో తెలుగును చదవటం, రాయటం నేర్చుకొని తెలుగు భాషకు తొలి శబ్దకోశ గ్రంథాన్ని, నేటికి ప్రామాణికంగా భావిస్తున్న తెలుగు నిఘంటువును, వ్యాకరణాన్ని రచించి తెలుగు భాషకు వన్నె తెచ్చిన మహనీయుడు సిపి బ్రౌన్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్డి వేణు, బొప్పే రవికుమార్, సత్యం, వెంకటరమణ, కృష్ణ విద్యార్థులు పాల్గొన్నారు.

నవోదయం 2.0 పై అవగాహన

కొత్తవలస: కొత్తవలస ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ జి.ఎస్. రాజశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో నవోదయం 2.0లో భాగంగా జోడి మెరక గ్రామంలో అవగాహన సదస్సు శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారీ, అమ్మకం అక్రమ మద్యం అమ్మకాలు నిర్వహించకూడదని తెలిపారు. ఒక వేల ఎవరైనా అలాంటి పనులు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది హెచ్‌సిటి వీర్రాజు, బి.రాముడు, బి. ఆదినారాయణ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

శృంగవరపుకోట: కూటమి తరపున ప్రభుత్వం చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తూ జనసేన పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వబ్బిన సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఎస్‌కోట, ఎల్‌కోట ముఖ్య నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక సమస్యలపైన కూటమి ఎమ్మెల్యే లలిత కుమారి సూచనలు సలహాలు తీసుకుంటూ ముందుకు వెళ్లాలని నిర్ణయించామన్నారు. రానున్న స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కూటమి తరపున నామినేటెడ్ పదవులు పైన సమిష్టి నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరామ న్నారు. ఈ సమావేశంలో జనసేన మండల అధ్యక్షుడు తాండ్రంగి చంటి, పట్టణ అధ్యక్షుడు మోపాడ చిన్ని, సీనియర్ నాయకుడు పెనుమత్స సురేష్ రాజు, ఎల్.కోట మండల నాయకులు ఫిరోజ్, రావాడ నాయుడు, పాల్గొన్నారు.

'సీతం'లో సెమినార్

విజయనగరం: సత్య ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం 'ప్లాన్ ఫర్ ది పిన్నాకిల్' అనే సెమినార్ నిర్వహించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆధునిక సాంకేతికత, ప్రస్తుత సమాజం యొక్క ప్రభావం గురించి అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌లో ఐటి అనలిస్టుగా ఉన్న భాను పవన్ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. వివిధ పరిశ్రమల్లో ఎఐ రోజువారీ జీవితంలో చూపుతున్న ప్రభావంపై వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, డేటా సైన్స్ విభాగాధిపతి డాక్టర్ రాధ, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ జి.వేణుమాధవ్, తదితరులు పాల్గొన్నారు.

డిఎల్‌టిసి రాష్ట్ర కార్యదర్శిగా కోట్ల శ్రీనివాస్

బొబ్బిలి: ప్రభుత్వ ఐటిఐ డిఎల్‌టిసి అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా కోట్ల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో కోట్ల శ్రీనివాస్‌ను రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ప్రభుత్వ ఐటిఐ ఉద్యోగులు, విద్యార్థులు సమస్యలు పరిష్కారానికి పని చేస్తామని శ్రీనివాస్ చెప్పారు. రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన శ్రీనివాస్‌ను, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.దేముడును విజయనగరంలో తోటి ఉద్యోగులు, విద్యార్థులు సన్మానించారు. ఐటిఐలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు ప్రతి ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు టెలీ స్పందన నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను 95736 44439కు ఫోన్ చేసి చెపితే పరిష్కారానికి పని చేస్తామని చెప్పారు.

ఎస్.కోటలో సత్తిపండు సందడి

శృంగవరపుకోట: మండలంలోని భర్తపురం గ్రామంలో ఉన్న శ్రీ కళ్యాణప్రసన్న వైభోగ వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని జబర్దస్త్ నటుడు సత్తిపండు శనివారం దర్శించుకున్నారు. అరుకు షూటింగ్‌కు వెళ్తున్న ఆయన మార్గమధ్యంలో ఆగి ఈ గుడికి వెళ్లారు. ఆయనకు ఆలయ ధర్మకర్త జయ విష్ణు సంప్రదాయంగా స్వాగతం పలికి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం సత్తిపండు మాట్లాడుతూ ఆ వెంకటేశ్వర స్వామి దయతో తాను ఈ స్థాయిలో ఉన్నానని పేర్కొన్నారు. ఈ ఆలయం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు

బాలికల వసతి గృహాన్ని సందర్శించిన ఎంఇఒ

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని శనివారం ఎంఇఒ పి.బాల భాస్కరరావు సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల్లో అధిక మార్కులు సంపాదించడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు గూర్చి వివరించారు. ఉపాధ్యాయులకు పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థుల సిలబస్‌ను పూర్తి చేయాలని సూచించారు. ఉపాధ్యాయుల హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. ఈ పరిశీలనలో సిఆర్‌పి రాంప్రసాద్, వసతి గృహ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు

ప్రజాశక్తి- బొబ్బిలి

దేశంలో ఉన్న అసమానతలను తొలగించి సమసమాజస్థాపనకు, ప్రజాసమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు నిర్వహిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. లోకబందు రెసిడెన్సీలో శనివారం సిపిఎం పట్టణ మూడవ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత అసమానతలు పెరిగిపోతున్నాయని విమర్శించారు. పెట్టుబడిదారులకు, కార్పోరేట్ సంస్థలకు రాయితీలు ఇచ్చి ప్రజలపై నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోల్, డీజిల్, విద్యుత్ ఛార్జీలు భారాలు వేస్తున్నారన్నారు. నిరుద్యోగ సమస్య పెరగడంతో ప్రజల జీవన ప్రమాణాలు తగ్గాయని చెప్పారు.పరిశ్రమలు మూతపడ్డాయని, సాఫ్ట్‌వేర్ రంగం కుదేలవుతుందన్నారు. గ్రామీణ ప్రాంత వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించే జాతీయ గ్రామీణ ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. ఉపాధి హామీని బలోపేతం చేసి కనీస వేతనం రోజుకు రూ.600 ఇవ్వాలని, ఏడాదికి 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలను అదుపు చేయాలని

పట్టణ మహాసభలో సిపిఎం జిల్లా కార్యదర్శి



మహాసభలో మాట్లాడుతున్న తమ్మినేని సూర్యనారాయణ

కోరారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వకపోవడం రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని విమర్శించారు. పెరుగుతున్న పెట్టుబడులకు అనుకూలంగా గిట్టుబాటు ధరలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రజల్లో ఐక్యత భావాన్ని దెబ్బ తీసేందుకు కుల, మత విభేదాలను రెచ్చగొడుతున్నారన్నారు. బిజెపి మతోన్మాదాన్ని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.లక్ష్మి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఉచితంగా మూడు సిలెండర్లు ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు ముందు డబ్బులు కడితే బ్యాంకు ఖాతాలో జమ చేస్తామనడం అన్యాయమన్నారు. డ్రగ్స్ విచ్చలవిడిగా అమ్మకాలు జరగడం, మద్యం విక్రయాలు పెంచడం వల్ల యువత చెడు మార్గంలో నడుస్తుందన్నారు. డ్రగ్స్, మద్యానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. బొబ్బిలిలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని, మద్యాన్ని నియంత్రించాలని, గ్రోత్ సెంటర్లో పరిశ్రమల నుంచి వస్తున్న కాలుష్యాన్ని నియంత్రించాలని, కార్మిక చట్టాల అమలు చేయాలని, నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, మున్సిపాలిటీలో ప్రతి రోజు సంపూర్ణంగా తాగునీరు అందించాలని, చెరువులు ఆక్రమణలు తొలగించాలని, రోడ్లు, కాలువలు నిర్మించాలని, రోడ్ల విస్తరణ చేపట్టాలని మహాసభలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, మండల కన్వీనర్ ఎస్.గోపాలం, పట్టణ నాయకులు పుణ్యవతి, యుగంధర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు స్టాపర్లు

ప్రజాశక్తి- బొండపల్లి

రోడ్డు ప్రమాదాల నివారణకు జాతీయ రహదారిపై స్టాపర్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని గజపతినగరం సి.ఐ. జివివి రమణ అన్నారు. శనివారం అంబటివలస గ్రామంలో 26వ జాతీయ రహదారిపై బొండపల్లి ఎస్ఐ యు.మహేష్ ఆధ్వర్యంలో వేగ నియంత్రణకు దోహదపడే స్టాపర్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన దారులు అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనాలను నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉండడంతో ఈ బోర్డులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. యువత మాదక ద్రవ్యాలకు, మద్యానికి అలవాటు పడటంతో అజాగ్రత్త వల్ల వాహనాలను నడపడం వల్ల ప్రమాదాలు సంభవిస్తు న్నాయని తెలిపారు. వేగ నియంత్రణ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు వల్ల ప్రమాదాలతో పాటు, ప్రజల ప్రాణాలను కాపాడ టానికి పోలీస్ శాఖ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి పాలూరు అప్పలనాయుడు, గ్రామ పెద్దలు పాలూరు రామునాయుడు, పాలూరు మురళి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అర్హులంతా ఓటు హక్కు పొందాలి : కలెక్టర్

ప్రజాశక్తి- డెంకాడ

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తు చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు. ఇందుకోసం నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 9,10 తేదీల్లో అలాగే 23,24 తేదీల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ శిబిరాల్లో ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసేందుకు దరఖాస్తులను, జాబితాలో చేర్పులు మార్పులను చేసేందుకు కూడా దరఖాస్తులను ఇక్కడ స్వీకరిస్తారని తెలిపారు. ఈ ప్రత్యేక తేదీల్లో బిఎల్ఒ లంతా ఇక్కడ అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

డెంకాడ మండలం మోదవలస సమీపంలోని గొండయ్య పాలెం ప్రాథమిక పాఠశాలలో బూత్ నెంబర్ 17ను జిల్లా కలెక్టర్ అంబేద్కర్ శనివారం పరిశీలించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను తనిఖీ చేశారు. బూత్ పరిధిలో ఓటర్ల సంఖ్య, కొత్తగా వచ్చిన దరఖాస్తులు తదితర అంశాలపై బిఎల్ఓ ను ఆరా తీశారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, ముఖ్యంగా యువ ఓటర్లకు అవగాహన కల్పించి, వారు ఓటు కోసం దరఖాస్తు చేసుకునేలా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించారు. మధ్యాహ్నం భోజన పథకం నిర్వహణపై ఆరా తీశారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నూకరాజు, తాహశీల్దార్ పద్మావతి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బొబ్బిలి: ఓటరు జాబితాను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ మోహన్‌రావు

అర్హులందరికీ ఓటుహక్కు కల్పించాలి

బొబ్బిలి: అర్హత ఉన్న ప్రతిఒక్కరికి ఓటుహక్కు కల్పించాలని ఆర్డిఒ మోహనరావు కోరారు. పట్టణంలోని సిబిఎం, ఐటిఐ కాలనీ పాఠశాలలో శనివారం నిర్వహించిన స్పెషల్ సమ్మరి రివిజన్-2025 ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటుహక్కు కల్పించాలని, మరణించిన వారి ఓట్లను తొలగించాలని చెప్పారు. ఓట్లు నమోదులో ఎటువంటి అవకతవకలకూ తావు లేకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం మెట్టవలస, పారాదిలో ఓట్లు నమోదును పరిశీలించారు. ఆయనతో తహశీల్దార్ ఎం.శ్రీను, ఎన్నికల డిటి గౌరీశంకర్ ఉన్నారు.

రామభద్రపురం: ఓటు హక్కు నమోదు సక్రమంగా అమలు జరిగేలా సంబధిత సిబ్బంది చర్యలు తీసుకోవాలని బొబ్బిలి ఆర్‌డిఒ మోహనరావు ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ సులోచనారాణితో కలిసి శనివారం ఆరికతోట, బూసాయవలస, రామభద్రపురం పాఠశాలల్లో ఓటు నమోదు ప్రక్రియను పరిశీలించారు. శని, ఆదివారాల్లో ఈ ప్రత్యేక ఓటు నమోదు ఉదయం 10 నుంచి సాయింత్రం 5గంటల వరకు బిఎల్వోల ద్వారా నమోదు చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఆదార్ కార్డు, వయసు, 10వ తరగతి మార్కుల జాబితా, పాస్ పోర్ట్ సైజ్ ఫోటోతో ఆన్లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం ఆరికతోట జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి ఆహార పదార్థాలు రుచి చూశారు. మెనూ ప్రకారం శుచి,శుభ్రత పాటించి పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కార్యాలయం సిబ్బంది, విఆర్ఒ శైలజా, వెల్ఫేర్ అసిస్టెంట్ గోవింద తదితరులు పాల్గొన్నారు.



డెంకాడ: దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

నెల్లిమర్ల: ఓటర్ల నమోదుకు దరఖాస్తుల స్వీకరణ, జాబితాలోని పేర్ల మార్పులు, తొలగింపులకు సంబంధించి దరఖాస్తులు, అభ్యంతరాలు స్వీకరణ కార్యక్రమం శనివారం మండలంలోని అన్ని పోలింగ్ స్టేషన్లో పరిధిలో బూత్ లెవెల్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా నిర్వహించారు. రామతీర్థం జంక్షన్ ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ స్టేషన్ నెంబర్ 27, 28, 29, 30లకు సంబంధించి ఏర్పాటైన కేంద్రాన్ని శనివారం తహశీల్దార్ బి సుదర్శన రావు సందర్శించి తనిఖీ చేశారు. కేంద్రంలో విధుల్లో ఉన్న బిఎల్‌ఒలకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డిటి వివిఆర్ జగన్నాధరావు పాల్గొన్నారు.

నీటి సంఘం ఎన్నికల పిఎస్‌ల పరిశీలన

వేపాడ: మండలంలోని నీటి సంఘం అధ్యక్ష ఎన్నికలు నిర్వహించనున్న సందర్భంగా గ్రామాలలో ఏర్పాటు చేసిన పిఎస్‌లను, ఇఆర్ఒ మురళీకృష్ణ, తహశీల్దార్ జె. రాములమ్మ శనివారం పరిశీలించారు. వేపాడ పిఎస్ నెంబరు 72, 73, 74, 78, 80లను పరిశీలించారు. పిఎస్‌లకు సంబంధించిన వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో విఆర్ఒ అప్పలరాజు, గ్రామ సచివాలయం మహిళా కానిస్టేబుల్, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

ఈనెల 16,17 తేదీల్లో విజయనగరంలో జరగనున్న సిపిఎం 10వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు పిలుపునిచ్చారు. శనివారం డాబా తోటలో శనివారం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాసభల సందర్భంగా నగరంలో ప్రదర్శన, బహిరంగ జరుగుతాయన్నారు. అనంతరం జరిగే ప్రతినిధుల సభలో ముఖ్యమైన సమస్యలు పై చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలో నేడు కూటమి ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు సాగిస్తున్నాయన్నారు. దేశంలో మతంపేరుతో,హిందుత్వం పేరుతో ప్రజలను ముక్కలు చేసే ప్రయత్నం మోడీ చేస్తున్నారన్నారు. నేడు జిల్లాలో, రాష్ట్రంలో ఉచిత ఇసుక అమలు కావడంలేదన్నారు. ట్రూ అఫ్ ఛార్జిలపేరుతో విద్యుత్ చార్జీలు పెంచుతున్నారని, సూపర్ 6 అటక్కెక్కిందని, నిరుద్యోగ భృతి చెల్లించడంలేదని అన్నారు. ఈ నేపథ్యంలో మహాసభలో భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక రూపొందించి పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ, ఎ.జగన్ మోహన్, నగర కమిటీ నాయకులు బి.రమణ పాల్గొన్నారు.

మెంటాడ: సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సిపిఎం మండల నాయకులు రాకోటి రాములు డిమాండ్ చేశారు. మెంటాడ గద్దెం చెట్టు వద్ద శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 16,17తేదీల్లో విజయనగరంలో జరిగే మహాసభలకు ప్రజలందరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఎన్నికలలో చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, నెలకు 1500, అమ్మబడి, తదితర హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్ కరెంట్ సర్దుబాటు చార్జీలను తగ్గించాలని కోరారు. ఈ సందర్భంగా మహా సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోములు తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్మికులు

జనావాసాల్లో మద్యం షాపు సహించం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వల్లంపూడి గ్రామంలో దుర్గా భవాని మద్యం షాపును తొలిసారి పాఠశాలకు, ప్రభుత్వ కార్యాలయాలకు దగ్గరలో పెట్టడంతో స్థానికులు షాపు ఇక్కడ వద్దని హెచ్చరించారు. దీంతో ఎక్సైజ్ శాఖ అధికారులు పరిశీలించి షాపు వెనుక భాగాన తాత్కాలికంగా మద్యాన్ని అమ్మడం కొనసాగించారు. తరువాత దబ్బిరాజుపేటకు వెళ్లే రోడ్డుకు ఆనుకొని గ్రామ కంఠంలో మద్యం షాపునకు షెడ్ నిర్మించారు. అయితే ఆ షెడ్‌కు ఆనుకొని అమ్మవారి ఆలయం, రైతులు కళ్లాలకు వెళ్లేందుకు ఇబ్బందిగా మారుతుందని తెలపడంతో మరలా వేపాడ ప్రధాన రోడ్డు మార్గానికి ఆనుకుని జనావాసాల మధ్య వైన్ షాపు ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. దీంతో స్థానిక మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ మద్యం షాపు ఏర్పాటు చేస్తే సహించేది లేదని అవసరమైతే రోడ్డుపై బైటాయించి నిరసన తెలుపుతామని శనివారం హెచ్చరించారు. అవసరమైతే కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళలు జి.పద్మ, ఎ.దేవి, జె.శాంతి, ఎస్. చిన్నమ్మలు, ఎం. చూడమ్మ, జ్యోతి, జి శ్రీను, ఏ బంగారమ్మ, మధు, ఎన్. సన్యాసమ్మ తదితరులు పాల్గొని ఆవేదన వ్యక్తం చేశారు.

నిరసన తెలిపిన మహిళలు



నిరసన తెలుపుతున్న మహిళలు

ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా అవగాహన

ప్రజాశక్తి- డెంకాడ

లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు డ్రగ్స్, ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా పోలీసులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మాదకద్రవ్యాల వ్యసనం, ర్యాగింగ్ పరిణామాలను వీడియో ప్రదర్శనతో చూపించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. ఈ వయస్సులో కష్టపడి చదువుకుంటే ఉన్నత శిఖరాలను అదిరోహించవచ్చునన్నారు. అనంతరం ర్యాగింగ్, యాంటి డ్రగ్స్‌కుపై కరపత్రాలను పంపిణీ చేశారు. కళాశాలలోనే ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేశారు. మాదక ద్రవ్యాల రహితంగా తోటివారితో గౌరవ ప్రదంగా ఉండాలనే సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. ఇందులో భాగంగా కళాశాల యాజమాన్యం డిఎస్‌పిని సత్కరించింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వివి. రామారెడ్డి, సిఐ జి. రామకృష్ణ, ఎస్ఐ ఎ. సన్యాసి నాయుడు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ హరిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.



డిఎస్‌పిని సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

చెరువులో అక్రమ తవ్వకాలు

ప్రజాశక్తి- రాజాం

మండలంలోని గుయ్యానవలస గ్రామ చెరువులో పట్టపగలే దొంగలు పడ్డారు. చెరువులో మట్టిని అక్రమంగా తవ్వుకొని తరలిస్తున్నారు. చెరువులో మట్టిని అమ్ముకొని లక్షల్లో ఆదాయం సంపాదిస్తున్నారు. టిప్పర్లు, ట్రాక్టర్లతో పగలంతా చెరువులను ఇష్టారాజ్యంగా తవ్వుకుని, మట్టిని తొలుచుకొని పోతున్నారు. గుయ్యానవలస గ్రామంలో ఉన్న చెరువు నుంచి జెసిబిలతో మట్టిని తవ్వి తరలిస్తున్నారు. పట్టపగలు జెసిబి పెట్టి తవ్వకాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ మట్టిని ఇంటి నిర్మాణాలకు, ఇటుక తయారీకి తరలిస్తున్నట్లు తెలుస్తుంది. స్థానిక విఆర్‌ఒకి ఫిర్యాదు చేసిన ఫలితం లేకుండా పోయిందని పలువురు యువకులు ఆరోపిస్తున్నారు. మట్టి తవ్వకాలతో భారీగా గోతులు ఏర్పడుతున్నాయని, వర్షాకాలంలో గోతుల లోతు అంచనా వేయలేక నీటిలో దిగి ప్రమాదాలు బారిన పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేని తవ్వకాలతో ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి పడుతుంది. చెరువులో తవ్వకాల వల్ల అక్కడ ఉపాధి హామీ పనులు నిలిపివేస్తారని, తద్వారా ఉపాధి హామీ కూలీలకు పని దొరకదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే తహశీల్దార్ స్పందించి చెరువులను పరిశీలించి మట్టి దొంగలపై తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



జెసిబితో మట్టిని ట్రాక్టర్‌లో వేస్తున్న అక్రమార్కులు

స్నేహితుడే చంపేశాడు..

● 24 గంటల్లో నిందితుడ్ని పట్టుకున్న పోలీసులు

ప్రజాశక్తి - జామి

తోటి స్నేహితుడే తన మిత్రుడిని హతమార్చాడు. దొంగతనం చేసి, తన పేరు బయటపెట్టాడని కక్ష పెట్టుకుని.. చంపేసిన ఘటన కలకలం రేపింది. విజినిగిరి గ్రామంలో ఇటీవల హత్యకు గురైన గనివాడ అచ్చిబాబు మృతి కేసును సిఐ రవికుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ వీరజనార్ధన్ ఛేదించారు. దీనికి సంబంధించి శనివారం పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను సిఐ వెల్లడించారు. విజినిగిరి గ్రామంలో హత్యకు గురైన గనివాడ అచ్చిబాబు, అదే గ్రామానికి చెందిన వెంపడావు సూరి బాబు మిత్రులు. మూడేళ్ల క్రితం సూరిబాబు ఒక సెల్‌ఫోన్, నగదు ఒక ఇంటిలో దొంగిలించాడు. కొట్టేసిన సెల్‌ఫోన్‌ను తన మిత్రుడైన అచ్చిబాబుకు ఇచ్చి అమ్మి పెట్టమని చెప్పాడు. దొంగతనం విషయం తెలియని అచ్చిబాబు జామిలో దీనిని అమ్మేందుకు ప్రయత్నించగా, అప్పటికే సెల్‌పోయిన వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు గాలిస్తుండగా జామిలో సెల్‌ఫోన్ అమ్ముతూ అచ్చిబాబు పోలీసులకు చిక్కాడు. అతనిని విచారించగా తనకేమీ తెలియదని సూరిబాబు అమ్మమని ఇవ్వడంతో అమ్మేందుకు వచ్చానని పోలీసులకు చెప్పాడు. దొంగతనంలో తన పేరు బయటపెట్టడం, గ్రామంలో పెద్దలు పంచాయతీ నిర్వహించి ఇద్దరికి చెరో మూడు వేలు జరిమాన విధిదించడంతో సూరిబాబు రగిలిపోయాడు. దీంతో తన పేరు బయటపెట్టిన అచ్చిబాబును చంపేస్తాని బెదిరించాడు. ఈ బెదిరింపులు ఎక్కువ కావడంతో అచ్చిబాబు హైదరాబాదు వెళ్లి పనిచేసుకుంటూ నాగుల చవితి పండగకు తన తల్లిను చూడటానికి తిరిగి స్వగ్రామం వచ్చాడు. పండగ అయిన తరువాత జామిలో వున్న అక్క కొండమ్మ ఇంటికి వెళ్లి హైదరాబాద్ వెళ్లిపోతున్నాని ఒక వందరూపాయిలు కావాలని తీసుకున్నాడు. హైదరాబాద్‌కు వెళ్లకుండా గురువారం సాయంత్రం తిరిగి స్వగ్రామానికి వచ్చేశాడు. అచ్చిబాబును గమనించిన సూరిబాబు తాను పాతకక్షలు మరిచిపోయాయానని, కలిసి మద్యం సేవిద్దామని చెప్పి గ్రామంలో ఉన్న బెల్టు షాపు వద్ద ఇద్దరూ మద్యం కొనుగోలు చేసి తాగారు. ఈ సమయంలో సెల్‌ఫోన్ వివాదం రేగింది. దీంతో ఇద్దరూ కొట్టుకున్నారు. అయితే సూరిబాబు విచక్షణ రహితంగా కొట్టడంతో అచ్చిబాబు చనిపోయాడు. మృతి చెందిన అచ్చిబాబును గ్రామ శివారు ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు తీసుకెళ్లి పడేసి విద్యుత్ షాక్‌తో చనిపోయినట్లు నమ్మిద్దామని ప్రయత్నం చేశాడు. అయితే మృతుని అక్క ఇచ్చిన ఫిర్యాదులో తన తమ్ముడును సూరిబాబు చంపేశాడని పేర్కొనడంతో ఆ కోణంలో విచారణ చేసి నిందితుడిని అరెస్టు చేశామని సిఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బొండపల్లి: మండలంలోని నెలివాడ గ్రామానికి చెందిన లోగిస గౌరి నాయుడు (51) శనివారం రోళ్లవాక సమీపంలో లారీ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గౌరినాయుడు రైతు బజార్ నుంచి స్వగ్రామం నెలివాడ తన స్నేహితునితో కలిసి ద్విచక్ర వాహనంపై తిరిగి వెళుతుండగా రోళ్లవాక సమీపంలో గల పైడితల్లమ్మ గుడి వద్ద లారీ ఢీకొని మృతి చెందాడు. మృతుని భార్య అప్పలసత్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ యు.మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ దొంగ అరెస్టు

ప్రజాశక్తి - విజయనగరం కోట

విజయనగరం రైల్వే స్టేషన్ ఫ్లాట్‌ఫారమ్ వద్ద శనివారం ఉదయం 10.30 గంటల సమయంలో బొబ్బిలి మండలం కలవరాయి గ్రామానికి చెందిన మరిచర్ల ప్రసాద్ అనే సెల్‌ఫోన్ దొంగను పట్టుకున్నట్లు జిఆర్‌పి స్టేషన్ ఆర్‌పిఎఫ్ ఎస్ఐ వి బాలాజీ రావు తెలిపారు. అతను వద్ద సెల్‌ఫోన్ రికవరీ చేసి రిమాండ్ నిమిత్తం విశాఖపట్నం రైల్వే కోర్టుకు పంపించినట్లు ఆయన తెలిపారు.

11 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-విజయనగరం కోట

అసిస్టెంట్ కమీషనర్ పి.రామచంద్రరావు ఆదేశాలు మేరకు ఎన్‌ఫోర్సుమెంట్ సిఐ సింహాద్రి, ఎస్ఐ రామారావు ఆధ్వర్యాన సిబ్బంది ఎస్.కోట మండలం పోతనపల్లి గ్రామంలో 11 బాటిల్స్‌ను పట్టుకున్నారు. నిందితుడు పైల సత్యన్నారాయణపై కేసు నమోదు చేశారు. రైడ్‌లో హెచ్.రాంబాబు, ఇసి లు ప్రసాద్, ప్రదీప్ పాల్గొన్నారు.